

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 3 లో..

నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.
9100900918
9100900931

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | ఆదివారం | 13 - 07- 2025 | సంపుటి : 1 | సంచిక : 41 | పేజీలు : 8 | వెల : 4/-

## వడ్డీల ఖర్చే ఎక్కువ



- ఆదాయంలో అధికభాగం వడ్డీల చెల్లింపులకే
- రుణాలపైన వడ్డీ తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నాం
- మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి పెడుతున్నాం
- యువతకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం
- ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్‌తో భేటీలో సిఎం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని, రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించు కున్నప్పుడే.. అభివృద్ధి సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్

మిగతా 2వ పేజీలో..



## న్యాయవాద వృత్తిలో ఎన్నో సమస్యలు

- చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
- కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహనతో ఉండాలి
- న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఇదే ఛాన్స్
- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటుసాగటం ఆందోళనకరం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీలో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉందన్నారు. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలమన్నారు. మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలన్నారు. జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయరంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు

మిగతా 2వ పేజీలో..



## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

- వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన
- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**నల్లగొండ- నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణ రవాణాశాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు.పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో..

## ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

- భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, సహాయ – పునరావాస పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలపై సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చాలా కాలంగా భూసేకరణలో జాప్యం కారణంగా గడువులోగా పనులు పూర్తికావడం లేదన్నారు. అంచనా వ్యయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు భూ యజమానులు తదితరు లతో సంప్రదింపులు జరపాలి. పరిహారం, పునరావాస ప్రక్రియను పారదర్శకంగా, సున్నితంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఆలస్యం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో పాటు చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. తద్వారా పనులకు ఆటంకం కలుగుతుంది.జిల్లా స్థాయిలో సమన్వయం ఎంతో ముఖ్యమని.. పనుల పురోగతికి ఆటంకంగా మారిన

మిగతా 2వ పేజీలో..



### సీతారామ ప్రాజెక్టు నీటి విడుదల

- మోటర్‌కు స్విచ్ ఆన్ చేసిన మంత్రి ఉత్తమ్

2 లో..

## బీసీలకు రేవంత్ మోసం!

- రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్స్ చెల్లదు
- ఎన్నికలు త్వరగా ముగించాలనే ఆర్డినెన్స్ ప్రతిపాదన
- బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు

2 లో..



### బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించాలి

- భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ - 4లో



3 లో..

## నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణలో బోనాల జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇప్పటికే గోల్కొండ బోనాలు ముగియగా సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు జరగనున్నాయి.

## వాణిజ్య పంటలతో లాభాలు గడించాలి

### రైతులకు మంత్రి తుమ్మల సూచనలు



**ఖమ్మం- నేటి ప్రభాత సూర్య :**

ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రధానంగా వాణిజ్య పంటలతో లాభాలు గడించాలని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు

మిగతా 2వ పేజీలో..

## కవిత బిసి ఉద్యమం చేశారా

- ఎందుకీ తీన్మార్ స్టెప్పులు వేస్తున్నారో
- మద్యం కుంభకోణంతో తెలంగాణ పరువు తీసిన కవిత
- తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**

మద్యం కుంభకోణంతో జైలులో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బిసి రిజర్వేషన్ల కోసం ఎప్పుడు ఉద్యమం చేశారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించినందునే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ కోసం సిద్ధమైందని కవిత చెబుతూ తీన్మార్ డాన్సులు చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంతో తెలంగాణ రాష్ట్రానికి చెడ్డ పేరు వచ్చిందని ఆయన శనివారం పార్టీ ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవితో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ మాట తప్పదు, మడమ తిప్పదు అని ఆయన తెలిపారు. బిసిల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం ఇంత చక్కటి కార్యక్రమాన్ని చేపడితే



బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కనీసం హర్షం వ్యక్తం చేయలేదని ఆయన అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బిసిల రిజర్వేషన్లు 33 నుంచి 27

మిగతా 2వ పేజీలో..

### మావోలకు భారీ ఎదురుదెబ్బ 2 లో..

- 23మంది మావోల లొంగుబాటు

### కోల్‌కతాలో మరో దారుణం 3 లో..

- ఐఐఎ విద్యార్థినిపై అత్యాచారం

### కల్తీ కల్లు ఘటనలో కిడ్నీ బాధితులు 3 లో..

- కిడ్నీ పనిచేయని వారి సంఖ్య 9కి చేరిక



4 లో..


## సెకన్ పాటు ఆగిన ఇంధన స్విచ్‌లు

- ప్రమాదం వెనక ఎలాంటి కుట్రకోణం లేదు
- పక్షి ఢీకొన్న ఆనవాళ్లు అసలే లేవు
- ఎయిరిండియా ప్రమాదంపై 15పేజీల ప్రాథమిక నివేదిక

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది.

## బిసి రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌ది

- బిఆర్ఎస్ ఎంత తక్కువగా మాట్లాడితే అంతమంచిది
- మంత్రి కోమటిరెడ్డి హితవు



**నల్లగొండ- నేటి ప్రభాత సూర్య :**

బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత తమదేనని, పేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డ అన్నారు. ఇంతకాలం మాటలు చెప్పిన బిఆర్ఎస్ బిసి రిజర్వేషన్లు ఎందుకు తేలేదని అన్నారు. ఈ రిజర్వేషన్లలోనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ వారు మాటలు చెప్పడం మానాలన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అండగాఉ ండాలని కోరారు. నల్లగొండ జిల్లా

మిగతా 2వ పేజీలో..

## ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటం

- స్కూటీలు, పెళ్లికి లక్ష, తులం బంగారం ఏవీ
- ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు



**రంగారెడ్డి- నేటి ప్రభాత సూర్య :**

ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష నగదు,తులం బంగారం హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్

మిగతా 2వ పేజీలో..

## కాళేశ్వరంపై అంతా దుష్ప్రచారం

- మండిపడ్డ హరీష్ రావు

**సిద్దిపేట- నేటి ప్రభాత సూర్య :**



కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కావాలనే పదే పదే కాళేశ్వరం కూలిపోయిందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండా పక్కన పెట్టారన్నారు. సిద్దిపేటలో 167 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు.వర్షాలకు గోదావరిలో

మిగతా 2వ పేజీలో..



## మావోలకు భారీ ఎదురుదెబ్బ

**23మంది మావోల లొంగుబాటు**

**రాయపూర్- నేటి ప్రభాత సూర్య :**

ఛత్తీస్‌గఢ్‌లో వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారీగా మావోలు లొంగిపోయారు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో ఎస్పీ రాబిన్‌సన్ ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. సుక్మా జిల్లాలో లొంగిపోయిన 23 మందిపై రూ.1.18 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 9మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ శర్మ ప్రకటించారు. నక్సలిజం.. చాలా మందిని వారి కుటు-ంబాలకు దూరం చేయడమే కాకుండా తండ్రి అయ్యే ఆనందం కూడా కోల్పోయేలా చేస్తుందని హోంమంత్రి ఆక్షేపించారు. ఉద్యమంలో ఉండి స్టెరిలైజేషన్ చేయించుకున్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే.. ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటు-న్న యువతి, యువకులకు అవసరమైతే సామూహిక వివాహాలు జరిపిస్తామని మంత్రి వెల్లడించారు. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలక పాత్ర వహించిన మావోయిస్టు నేత లోకేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు.

## వాణిజ్య పంటలతో లాభాలు గడించాలి

మొదటిపేజీ తరువాయి..

పూర్తి చేయా లన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని తెలిపారు. మే నెలలో కురిసిన వర్షాలతో పంటసాగు ప్రారంభించిన రైతులకు ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు నేడు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌ది

మొదటిపేజీ తరువాయి..

దండంపల్లిలో రూ. 8కోట్ల వ్యయంతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రవాణా శాఖ నుంచి ఏ అవసరమున్న నల్గొండ జిల్లాకు అధిక నిధులు ఇవ్వాలన్నారు..బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని చెప్పారు. రూ.6 వేల కోట్లు- ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్ లో కొట్లాడరని చెప్పారు. బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు.

## ప్రభుత్వానిది ప్రచార ఆర్భాటం

మొదటిపేజీ తరువాయి..

నియోజకవర్గ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాలనను టార్గెట్ చేసిన ఆమె, ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ-లు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించిన కవిత, సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్‌నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను తక్కువ చేశారని, ఫ్రీ పథకాలు అందిస్తామనే చెప్పి సేవలు కట్ చేసిన దారుణ పాలన ఇది అని విమర్శించారు. ఇది పనిచేసే ప్రభుత్వం కాదు... ప్రజలే వెంటే ఉండి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హేళన చేసిన కవిత, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కాళేశ్వరంపై అంతా దుష్ప్రచారం

మొదటిపేజీ తరువాయి..

8లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి. మోటార్లు ఆన్ చేయ కుండా రాజకీయాలు చేస్తున్నా రు. మోటార్లు ఆన్‌చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్ నిండిపోతుంది. మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయని అన్నారు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు కాళేశ్వరంలో భాగం కావా? ఇవేమీ చూడకుండా కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చపెడితే.. మీరేం చేశారో.. మేమేం చేశామో మాట్లాడుకుందాం అన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే ఆరు నెలల్లో నీళ్లు ఇవ్వొచ్చు. మేం ప్రశ్నించడంతోనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేశారు. ఓట్లకు ఓట్లకు మధ్య మీరు రైతుభరోసా ఇస్తున్నారు. రైతుభరోసాను ఎలా కోత పెడదామనే చూస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు.

# బిసిలను మరోమారు మోసం చేస్తున్న రేవంత్

- రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్స్ చెల్లదు
- ఎన్నికలు త్వరగా ముగించాలనే ఆర్డినెన్స్ ప్రతిపాదన
- బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. శనివారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు ఉందని నొక్కిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు- చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తేలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు-చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2021లో వికాస్ కిషన్‌రావు



వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్‌ఎస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## కవిత బిసి ఉద్యమం చేశారా

మొదటిపేజీ తరువాయి..

శాతానికి తగ్గాయని ఆయన విమర్శించారు. బిసిల పట్ల బిఆర్‌ఎస్‌కు ఎందుకు అంత అక్కసు అని ఆయన ప్రశ్నించారు. కడుపు నిండా విషం నింపుకున్న బిఆర్‌ఎస్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, దీనిని బిసిలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. బిఆర్‌ఎస్‌లో దెయ్యాలు ఉన్నాయని కవిత లోగడ చేసిన ఆరోపణను మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావిస్తూ ఇప్పుడు ఆ దెయ్యాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే బిసిని సిఎం చేస్తామన్న బిజెపి కనీసం అధ్యక్షున్ని అయినా నియమించలేదని ఆయన విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ పార్టీ మార్క్ అని ఆయన తెలిపారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ ప్రకటించానని, ఇప్పుడు పిసిసి అధ్యక్షునిగా ఉన్నప్పుడు బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

## సీతారామ ప్రాజెక్టు నీటి విడుదల

**మోటర్‌కు స్విచ్ ఆన్ చేసిన మంత్రి ఉత్తమ్**

**ఖమ్మం, నేటి ప్రభాత సూర్య :**

గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు శనివారం సీతారామ ప్రాజెక్టులో భాగంగా అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద ఏర్పాటు-చేసిన ఎత్తిపోతల నుంచి ఒక మోటారు ఆన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటపడి సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించే పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం గోదావరికి వరద ఉధృతంగా వస్తోంది. మరో వైపు పాలేరు వద్ద అండర్ టన్నెల్ గత ఏడాది కూలిపోయింది.. దీంతో సాగర్ జలాలు ఖమ్మం జిల్లాలోని పంటపొలాలకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. మరో పదిరోజులు వరకు నీరు రాని పరిస్థితి. దీనివల్ల తల్లాడ, కల్లూరు మేజర్ల కింద పొలాలు ఎండిపోతున్నాయి.. దీనిని దృష్టిలో పెట్టుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు కింద కొత్తూరు వద్ద ఏర్పాటు- చేసిన మోటార్లలో ఒక దానిని శనివారం ఆన్ చేశారు. దీనివల్ల గోదావరి జలాలు ఏన్కూరు వద్ద సాగర్ కాలువలో ప్రవేశించి తల్లాడ, కల్లూరు మేజర్ల కింద ఉన్న సుమారు 30వేల ఎకరాల్లో ఉన్న వరిపంటను రక్షించేందుకు అవకాశం ఉంది. సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోయినప్పటికీ అవకాశం ఉన్న మేరకు మోటార్లు బిగించి ఖమ్మం జిల్లా రైతును ఆదుకోవడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయమని రైతులు తెలిపారు.

## ఎఐ ఆధారంగా భగవద్గీత

**ఐదునిముషాల నిడివిలో పూర్తి**

**నేటి ప్రభాత సూర్య, ఇంటర్‌నెట్ డెస్క్:**

ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 'అదిపురుష్', 'శాకుంతలం', 'హనుమాన్' లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి 'రామాయణ' కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు- అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు- చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. 'వర్చువల్ రియాలిటీ ద్వారా



మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు' అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.

## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

మొదటిపేజీ తరువాయి..

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ- అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ -టె-స్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ -ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని...అక్కడ -ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ ఆ-ూ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## వడ్డీల ఖర్చే ఎక్కువ

మొదటిపేజీ తరువాయి..

శనివారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌తో పాటు- రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు సీఎం వివరించారు.రాష్ట్ర వ్యాప్తంగా సారించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, మూడు రంగాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలియజేశారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ఆందోళన వ్యక్తం చేశారు. అధికశాతం వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఇలాంటి విధానం ద్వారానే, సమాఖ్య వ్యవస్థ బలోపేతమవుతుందని, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్, ఆర్ఆర్ఆర్‌ను ఔటర్‌తో అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పర్యటనలో ఉన్న సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌ను సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందించారు.

## న్యాయవాద వృత్తిలో ఎన్నో సమస్యలు

మొదటిపేజీ తరువాయి..

'ఎవరేం చెబుతున్నారు' అనేవిషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం అన్నారు.న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే,ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీలకోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి.ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలు చేయడం అవసరం లేదని చెప్పారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు,వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి.నల్సార్ యూనివర్సిటీ తనస్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

## ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

మొదటిపేజీ తరువాయి..



సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్లతో సమన్వ యం చేసుకోవాలన్నారు. ప్రతి స్థాయి లోనూ పనులు సాఫీగా జరగాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల స్థితి గతులపై ఆరాతీసిన మంత్రి ఉత్తమ్.. ముఖ్యమైన సమస్యలను గుర్తించారు. వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు ప్రాజెక్టులు ఎంతో ముఖ్య మన్నారు. కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే కీలకమైన పాల మూరు - రంగారెడ్డి, సీతారామ సాగర్ ప్రాజెక్టుల పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కాలువ లైనింగ్ మొదలు సొరంగాల వరకు ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు.



# నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- పట్టువస్త్రాలు సమర్పించనున్నముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్‌- నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణలో బోనాల జాతర అం గరంగ వైభవంగా కొనసాగుతోం ది. ఇప్పటికే గోల్కొండ బోనాలు ముగియగా సికింద్రాబాద్‌ లష్కర్‌ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం సికింద్రా బాద్‌ ఉజ్జయిని మహంకాళి బోనా లు జరగనున్నాయి. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లక్షలాదిమంది భక్తులు తరలి వచ్చే అవకాశంతో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది ప్రభుత్వం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటోంది. ఆదివారం మహంకాళి బోనాలకు ఉదయం 4.10 బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ ధర్మకర్త కుటుంబం నుంచి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు. సోమవారం రోజు రంగం భవిష్యవాణితో పాటు- అమ్మవారి అంబారి ఊరేగింపు, ఆదివారంరాత్రి, సోమవారం రాత్రి అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు ఉంటుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం 6 క్యూలైన్‌ లు ఏర్పాటు- చేశారు భక్తులు. బాట షోరూం నుంచి 2 , రాంగోపాల్‌ పేట్‌ పోలీస్‌ స్టేషన్‌ నుంచి 2, సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ నుంచి 2 క్యూలైన్లు ఉన్నాయి. క్యూ లైన్‌ లో 16 మీటర్లకు ఒక ఎమర్జెన్సీ గేట్‌ ఏర్పాటు- చేశారు. భారీ పోలీస్‌ బందోబస్తుతో పాటు 70 సీసీటీ-వి కెమెరాల నడుమ బోనాల జాతర జరగనుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా, మొబైల్‌ వాష్‌ రూమ్స్‌ ఏర్పాటు చేశారు. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి జోగినిలు, శివశక్తులకు దర్శనం చేసుకునేందుకు స్పెషల్‌ టైం కేటాయించారు. శివ శక్తులు, జోగినిల కోసం మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు సమయం కేటాయించారు.


# కోల్‌కతాలో మరో దారుణం

## ఐఐఎ విద్యార్థినిపై అత్యాచారం

**కోల్‌కతా- నేటి ప్రభాత సూర్య :**



పశ్చిమ బెంగాల్‌ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. రోజుకో ఘటన వెలుగులోకి వస్తుంది. కోల్‌కతాలోని ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెనేజ్‌మెంట్‌ చదువుతున్న విద్యార్థినిపై మరో విద్యార్థి అత్యాచారం చేశాడు. ఓ విద్యార్థిని మానసికంగా కృంగిపోవడంతో ఆమె స్నేహితుడు కౌన్సిలింగ్‌ ఇస్తానని రమ్మని కబురు పంపాడు. విద్యార్థిని బాయ్స్‌ హాస్టల్‌కు వెళ్లిన తరువాత మత్తు మందు కలిపిన కూల్‌ డ్రింక్‌ ఆమెకు స్నేహితుడు ఇచ్చాడు. ఆమె స్పృహ కోల్పోయిన తరువాత ఆమెపై అతడు అత్యాచారం చేశారు. ఆమెకు స్పృహ వచ్చిన తరువాత తనపై అఘాయిత్యం జరిగిందని తెలుసుకొని అతడిని ప్రశ్నించింది. ఈ విషయం బయట చెబితే చంపేస్తానని బెదిరించాడు. వెంటనే ఆమె స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోల్‌కతాలోని ఓ జూనియర్‌ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. నెల రోజుల క్రితం న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం విదితమే.



# భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి

**భద్రాచలం- నేటి ప్రభాత సూర్య :**

భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయానికి నీటిమట్టం 40.5 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నది ఉద్ధృతి వల్ల గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండు రోజుల క్రితం 23 అడుగులు ఉన్న గోదావరి ప్రవాహం.. నేడు 40.5 అడుగులకు చేరింది. దీంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు వరద నీటిలో మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాలవద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. సీత వాగు వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ వారి విగ్ర హం వరద నీటిలో మునిగిపోయింది. గోదావరిలో నీటిమట్టం 43 అడుగు లకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

# నీటి సంపులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి

**హైదరాబాద్‌- నేటి ప్రభాత సూర్య :**

హైదరాబాద్‌ మియాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నాలుగేళ్ల బాలుడు నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్‌ లోని హఫీజ్‌పేట్‌ మార్తాండ నగర్‌ కాలనీలో శ్రీను, నీల దంపతుల నాలుగేళ్ల కుమారుడు అభి ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జులై 12న నీటి సంపులో పడి మృతి చెందాడు. కూలి పనుల కోసం ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్లిన తల్లిదండ్రులు తమ కుమారుడి మరణ వార్త విని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇంటి యజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని కుటు-ంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నపిల్లలు ఇంటి దగ్గర ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారిని నిత్యం గమనిస్తూ ఉండండి. లేదంటే ఇలాంటి అనుకోని సంఘటనల తర్వాత బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

- కాంగ్రెస్‌ ప్రభుత్వ చారిత్రక నిర్ణయాలు
- వీటిని అభినందించలేకపోతున్న బిఆర్‌ఎస్‌
- పిసిసి చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌

**హైదరాబాద్‌- నేటి ప్రభాత సూర్య :**



కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్‌ కుమార్‌ గౌడ్‌.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్‌ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్‌ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

# కల్తీ కల్లు ఘటనలో కిడ్నీ బాధితులు

## కిడ్నీ పని చేయని వారి సంఖ్య 9కి చేరిక

**హైదరాబాద్‌- నేటి ప్రభాత సూర్య :**



కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులకు వైద్యం కొనసాగుతోంది. కల్తీ కల్లు బారిన పడిన వారిలో 33 మంది నిమ్స్‌ ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్నారు. నిమ్స్‌లో చికిత్స పొం దుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కిడ్నీ పనిచేయని బాధితుల సంఖ్య తొమ్మి దికి చేరింది. ఇప్పుడు తాజాగా మరో ఇద్దరు బాధితులకు కూడా డయాల సిస్‌ చేయాల్సిన పరి స్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న వారిలో 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలి పారు. ఇంకో 12 మందిని అబ్జర్వే షన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు. మరో 19 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతు న్నారు. ఈ కల్తీ కల్లు ఘటనలో ఇప్ప టివరకు తొమ్మిది మంది మృత్యు వాత పడిన విషయం తెలిసిందే. ఇక కల్తీ కల్లు ఘటనలో ప్రధాన నింది తుడు కూన సత్యం గౌడ్‌ను కూకట్‌ పల్లి పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. ఆయన కుమారులు రవితేజ గౌడ్‌,సాయితేజగౌడ్‌ను ఇప్పటికే పోలీ సులు అరెస్ట్‌ చేశారు. కూన సత్యం గౌడ్‌ అరెస్ట్‌తో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. అలాగే ఈ ఘట నలో బాల్‌నగర్‌ ఎక్సైజ్‌ సీఐపై వేణు కుమార్‌పై వేటుపడింది. కల్తీ దం దాపై చర్యలు తీసుకోని కారణంగా ఎక్సైజ్‌ సీఐను సస్పెండ్‌ చేశారు. అంతేకాకుండా మరికొంత మందిపై విచారణకు ఎక్సైజ్‌ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కల్తీ కల్లు ఘటనపై కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్‌ స్టేషన్‌లలో మూడు కేసులు, బాలానగర్‌ ఎక్సైజ్‌ స్టేషన్‌లో ఆరు కేసులు నమోదు అయ్యాయి.

# అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ఇబ్రహీంపట్నం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు
- మంచాల మండలం కిసాన్‌ సెల్‌ అధ్యక్షుడు కావాలి బుగ్గ రాములు
- కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు మాధగోని జంగయ్య గౌడ్‌

**ఇబ్రహీంపట్నం -నేటి ప్రభాత సూర్య, జోన్‌ ఇంచార్జ్‌ (వెంకటేష్‌) :**



మంచాల మండలం కేంద్రంలో కావాలి బుగ్గ రాములు ముదిరాజ్‌,మాధగోని.జంగయ్య గౌడ్‌ కలిసిమాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలోఅభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజలకుఇచ్చిన మాటనిలపెట్టుకో వాలనే దృఢసంకల్పంతో ఎమ్మెల్యేగా గెలుపొందిన నాటి నుండి గ్రామాల్లోతిరుగుతూ ప్రజాసమస్యలు తెలుసు కుంటూ తనదగ్గరకు వచ్చిన ప్రజలప్రతిసమస్యకు పరిష్కా రంచేస్తూ పాలన సాగిస్తున్నగొప్ప ఎమ్మెల్యేమల్‌ రెడ్డి రంగారెడ్డి అన్నరు. నేడునియోజకవర్గంలోని గ్రామాల్లో అలుపెరుగని పర్యటనలుచేస్తూ ప్రతి రోజు ఏదో ఒక మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంచుడుతూ అభివృద్ధిపథంలో శరవేగంగా దూసుకెళ్తున్నఅభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యేమల్‌ రెడ్డిరంగారెడ్డి అన్నారు. ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలో గెలుపొందిన అతితక్కువ సమ యంలో ఇప్పట్టివరకు ఎఎమ్మెల్యే ఇంతవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. అది మా ప్రియతమ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌ రెడ్డిరంగారెడ్డికే పూర్తి స్థాయిలో అభివృద్ధిచేయటం సాధ్యమవుతుందన్నారు. ఏదో ఒక మండలంలోఅభివృద్ధికార్యక్రమాలు,ప్రారంభోత్సవాలు చేస్తూ కాంగ్రెస్‌ పార్టీ నాయకులకు కార్యకర్తలకు నూతన ఉత్తేజంతో ఉండేటట్టు చేస్తూ నియోజకవర్గం ప్రజలకు భరోసా కల్పిస్తూ పాలనలో ముందుకు సాగుతున్న ప్రియ తమ ఎమ్మెల్యేకకు మాప్రత్యేకధన్యవాదాలు తెలియజేస్తున్నా మన్నారు.కాంగ్రెస్‌ పార్టీఅధిష్ఠానం గుర్తించిమంత్రిపదవి ఇవ్వాలని అధిష్టానాన్నికోరారు. కార్యక్రమంలో కా ంగ్రెస్‌ నాయకుడు పంబాల బుగ్గ రాములు, జోగు శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**తుర్కయంజల్‌- నేటి ప్రభాత సూర్య :**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని తుర్కయంజాల్‌ మున్సిపల్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్‌ అన్నారు. శనివారం తుర్కయంజాల్‌ కూడలిలో కాంగ్రెస్‌ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు మున్సిపల్‌ అధ్యక్షురాలు కొత్త కురుమ మంగమ్మ శివకుమార్‌ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌ రెడ్డి రంగారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్‌ సభలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం ఇస్తామని వెల్లడించింది. అనంతరం క్యాబినెట్‌ సమావేశంలో మంత్రివర్గం ఆమోదించడం హర్షించదగ్గ విషయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ కల్పించాలని నిర్ణయం ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌ మెట్‌ మాజీ జెడ్పిటిసి సభ్యులు బింగి దాస్‌ గౌడ్‌, గడ్డాన్నారం మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌ చారి, నాయకులు దాసరి సుధాకర్‌ రెడ్డి, కుంట గోపాల్‌ రెడ్డి, పూజారి శంకరయ్య గౌడ్‌, గుడ్ల అర్జున్‌, ఎల్మటి వెంకట్‌ రెడ్డి, శ్యామల, ఎరుకలి రవి,శంకర్‌ రెడ్డి పాల్గొన్నారు.

# ఇరాన్‌లో బాలికపై అత్యాచారం

## వ్యక్తికి బహిరంగ మరణశిక్ష

**టెహ్రాన్‌(నేటి ప్రభాత సూర్య డెస్క్‌) :**

ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్‌ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం .. బుకాస్‌కు చెందిన ఓ బాలికను అత్యాచారం చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని భాధిత కుటు-ంబ సభ్యులు , ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా, సుప్రీం కోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటు-ంబ సభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్టు- చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్‌లో బహిరంగంగా మరణశిక్షలు విధిం చడం సాధారణమే. హత్య, అత్యాచారం వంటి తీవ్రత ఎక్కువ ఉన్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలు చేస్తారు. మానవహక్కుల సంఘాల ప్రకారం.. ప్రపం చంలో ఎక్కువ మరణశిక్షలు అమలు చేసే దేశాల్లో ఇరాన్‌ రెండోస్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.




# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

## కేంద్ర ఎన్నికల కమిషన్‌ పరిశీలన

**న్యూఢిల్లీ,నేటి ప్రభాత సూర్య :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్‌ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్‌ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్‌ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్‌ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్‌ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్‌, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే ప్రక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్రే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్‌ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల్ల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు- ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.




# ఐదు మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డులు

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లోని నగరాలకు వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా ఆంధ్రప్రదే శ్‌లోని అయిదు మున్సిపల్‌ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. విశాఖపట్నం, రాజ మండ్రి, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరాలు ఆ పురస్కారాలు దక్కించుకున్నాయి. జాతీయ స్థాయిలో స్పెషల్‌ కేటగిరీ మినిస్టీరి యల్‌ అవార్డును విశాఖ నగరం సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్‌ అవార్డుకు రాజమండ్రి ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్‌ సిటీస్‌ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యా యి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్‌ అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ చైర్మన్‌ పట్టాభిరామ్‌ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కారణంగానే ఈ అవార్డులు దక్కాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృషి చేసిన అధికారులు, పారిశు ద్ధ సిబ్బంది, సహకరించిన ప్రజలకు పట్టాభి అభినందనలు తెలిపారు.

# సంపాదకీయం

## ఉచిత పథకాలు ఎవడబ్బ సొమ్ము!

అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్న పాలకుల ధోరణి కారణంగా ..ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. ఉచిత పథకాలే అభివృద్ధి అన్నచందంగా పాలన సాగుతోంది. అభివృద్ధి పక్కకుపోయింది. కేవలం పందేరాలు కొనసాగుతున్నాయి. విద్య,వైద్యరంగాలను విస్మరించారు. మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదు. రోడ్ల విస్తరణ కానరావడం లేదు. దోమల నిర్మూలన అటకెక్కింది. పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో ఆర్థిక కార్యకాలాపాలు సాగడం లేదు. ఈ క్రమంలో కొత్తకొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పలు చేసామని తెలుగు వల్లభులు చాటుకుంటున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేస్తున్నారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ.. దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెడుతున్నారు.

ఉచిత విద్యుత్, కిలో రూపాయికే సన్న బియ్యం, ఉచిత బస్సు, ఇంటింటికీ పెన్షన్లు వంటి పథకాల జోరు కొనసాగుతోంది. వీటికి తోడు కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇవన్నీ అమలు చేయడానికి అప్పులు చేయడం, వడ్డీలకు మళ్లీ అప్పులు చేయడం, వివిద రకాల్లో పన్నులు వడ్డించడం అలవాటయ్యింది. ఆదాయం పెచే శాఖలపై అదేపనిగా సమీక్షలు చేయడం చేస్తున్నారు. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది.. వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయడం లేదు. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు.. అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్నప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు.. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం ద్వారా తమను తాము గొప్ప పాలకులుగా భావిస్తున్నారు. ఇప్పుడు ఖర్చు పెడుతున్న ప్రతిపైసా వీరి జేబులోంచి తీయడం లేదు.

కనీసం ఒక్క రూపాయి కూడా ఇందులో కలపడంలేదు. రైతుభరోసా కావచ్చు... రుణమాఫీ కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు.. దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రప్రజలే అని గుర్తించాలి. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఇలాంటి పథకాల వల్ల ఆర్థిక దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర వల్లభులు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి.

జీతాలకు ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేస్తున్నామనుకుంటున్న కాంగ్రెస్, కూటమి పాలకులు కళ్లు తెరవాలి. పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అధికారాన్ని గుప్పిట్లో ఉంచుకుని చేస్తున్న యత్నాలు విరమించుకోవాలి.

ఉచిత పథకాలపై నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఇద్దరు సిఎంలు వాటిని ఆపాలని ప్రయత్నించడం లేదు సరికదా అదేదో మహత్కార్యం చేసినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలపై కత్తెర వేయాలి. డబ్బుల పంపిణీని ఆపాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతుల రుణ మాఫీలు, ఉచిత్ గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల కారణంగా తెలంగాన అప్పుల్లో కూరుకుపోయింది. వీటిగురించి గొప్పలు చెప్పడం మానుకోవాలి. పథకాలు ఎంతమంచివైనా అర్హులకు సాయం అందించడంలో తప్పు లేదు. కానీ దుబారా పథకాలను కొనసాగిస్తే ప్రజలు ఊరికే వచ్చిన వాటిని తింటారు. తరవాత తిట్టడానికి కూడా వెనకాడరు.

విపక్షాలు కూడా ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టాలని కోరాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యతులు కాగలరు. రూపాయికి కిలో సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రైతుభరోసా, ఉచిత బస్సు వంటి పథకాలు ఇలా ఒక్కోటి చెప్పుకుంటూ పోతే..ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్క గట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగుపడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరి పాలన అందించిన వారం అవుతాం. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా ఇంకా పేదలు అంటూ పాలన చేయడం సరికాదు. ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించగలిగే నిర్ణయాలు మాత్రమే కావాలి. ప్రజలకు నేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. బంగారు పళ్లెంలో అన్నం పెట్టాలని ఎవరూ కోరుకోవడం లేదు. అన్నం తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు.

## బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించాలి

### భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్

హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించడం లేదని అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు- చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టు-బడి ఉండాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.



# సెకన్ పాటు ఆగిపోయిన ఇంధన స్విచ్‌లు

- ప్రమాదం వెనక ఎలాంటి కుట్రకోణం లేదు
- పక్షి ఢీకొన్న ఆనవాళ్లు అసలే లేవు
- ఎయిరిండియా ప్రమాదంపై 15పేజీల ప్రాథమిక నివేదిక

న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు- చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది. జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు- మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిం దని పేర్కొంది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్ల పాటు గాల్లో ఉన్నట్లు- వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటికల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపోయిందని నివేదిక వివరించింది. ఇంజిన్లు శక్తిని కోల్పోయిన తర్వాత ర్యామ్ ఎయిర్ టర్బైన్‌ను యాక్టివేట్ చేసినట్లు గుర్తించారు. ఇది యాక్టివేట్ అయినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కన్పించిందని ఏఏఐబీ తమ నివేదికలో వెల్లడించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్న ఏఏఐబీ, ఈలోపే విమానం కూలిపోయిందని వివరణ ఇచ్చింది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోల పరిశీలన పూర్తి చేసినట్లు చెప్పింది. విమానానికి సంబంధించి రెండు ఇంజిన్లను వెలికితీసినట్లు-, తదుపరి పరీక్షలకు కాంపోనెంట్స్‌ను గుర్తించామని పేర్కొంది. ఇంజిన్లను భద్రపరిచినట్లు తెలిపింది. ప్రమాదానికి ముందు ఇంధనం, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏమీ లేవని తన నివేదికలో స్పష్టం చేసింది. విమానంలో ఇంధనం కూడా స్వచ్ఛంగానే ఉందని, కలుషితమైన ఆనవాళ్లు లేవని తెలిపింది.



## ప్రాథమిక నివేదికపై ఇప్పుడే నిర్ణయం తగదు

### మీడియాతో కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు



విశాఖపట్టణం : అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికపై కేంద్ర విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని విశాఖపట్నంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు-, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ధరణకు రాకుండా తుది నివేదిక కోసం వేచిచూద్దామని తెలిపారు. గత నెలలో జరిగిన అహ్మదాబాద్-లండన్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో నివేదిక ప్రాథమిక నివేదికను వెల్లడించింది. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఆఫ్ కావడంతో, ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయినట్లు తేలింది. అయితే, ఇలా ఎందుకు జరిగిందనే దానిపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఈ నివేదికపై పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శనివారం స్పందించారు. దీనిపై మనం ఇప్పుడే ఏలాంటి నిర్ధారణకు రాకూడదని చెప్పారు. మనకు ప్రపంచంలోనే అత్యుత్తమ పైలట్లు-, సిబ్బంది ఉన్నారని తాను నమ్ముతున్నానని, దేశంలో పైలట్లు, సిబ్బంది చేస్తున్న అన్ని ప్రయత్నాలను అభినందిస్తున్నానని చెప్పారు. వారే పౌర విమానయానానికి వెన్నెముక అని చెప్పారు. కాబట్టి మనం ఇప్పుడే ఏ నిర్ణయానికి రాకుండా, తుది నివేదిక కోసం వేచి చూద్దామని విలేకరులతో అన్నారు.

## విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

### విచారణకు పూర్తిగా సహకరిస్తామన్న బోయింగ్

న్యూఢిల్లీ : అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసిన క్రమంలో బోయింగ్ సంస్థ స్పందించింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ నివేదికపై బోయింగ్ సంస్థ స్పందించింది. విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని పేర్కొంది. అంతేకాదు బాధితులకు అండగా ఉంటామని వెల్లడించింది. 'ఎయిర్ ఇండియా విమానం-171 ప్రమాదంలో మరణించిన ప్రయాణికులు, సిబ్బంది చుట్టూనే మాఆలోచనలు తిరుగుతున్నాయి. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉం టాం. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రొటోకాల్ ప్రకారం.. ఏఐ-171కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఏఏఐబీకి అందించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొంది. ఈ మేరకు బోయింగ్ ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు- మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు.పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది.

## ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగే ముద్దు

### ఏటా జూలై 12న పేపర్ బ్యాగ్ దినోత్సవం

న్యూఢిల్లీ,నేటి ప్రభాత సూర్య :


భూమిలో త్వరగా కరిగిపోయే పేపర్ బ్యాగ్‌ల పేరు మీద ఓ దినోత్సవాన్ని జరిపే పరిస్థితులు ఈ రోజుల్లో ఉన్నాయి. కారణం కాలుష్యం. ఇందుకు సంబంధించి కొన్ని కఠిన వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రతి సంవత్సరం జులై 12న ప్రపంచ దేశాలన్నీ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని జరుపు తున్నాయి. తెల్లారితే చాలు... మనం ఏ షాపుకి వెళ్లినా... కూరగాయల కోసం, టిఫిన్ల కోసం వెళ్లినా ..ప్లాస్టిక్ లేదా పాలిథిన్ కవర్లలోనే ఐటెమ్స్ ఇస్తుంటారు. వాడి పారేశాక... అవి భూమిలో కరగవు. కొన్ని వేలు, లక్షల సంవత్సరాలు కరగకుండా అలాగే ఉంటాయి. ఫలితంగా సముద్రాలు, నదులు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. చివరకు సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ కవర్లే ఎక్కువనే రోజులు వచ్చేలా ఉన్నాయి. ఈ పాలిథిన్ కవర్ల బదులు మనమే పేపర్ బ్యాగులు వాడితే బాగుంటుందనే ప్రచారం మొదలైంది. వీటి వల్ల పర్యావరణానికి కాలుష్యం పెద్దగా ఉండదు. పైగా... ఇవి భూమిలో త్వరగా కరిగిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ రోజున స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పేపర్ బ్యాగుల వాడకం పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రజలను పేపర్ బ్యాగులు వాడమని ప్రోత్సహిస్తాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి.అమెరికాకి చెందిన ఫ్రాన్సిస్ వోల్లే మొదటిసారి పేపర్ బ్యాగ్ యంత్రాన్ని తయారుచేశారు. ఓ రకమైన కలపతో ఈ బ్యాగులను తయారుచేస్తారు. 1871లో మార్గరెట్ నైట్... మరో యంత్రం చేశారు. అది ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్స్ తయారుచేసింది. ఆమెను గ్రాసరీ బ్యాగ్ మాతృమూర్తిగా పిలుస్తారు. ఇలా కాలక్రమంలో రకరకాల యంత్రాలు వచ్చి... మంచి పేపర్ బ్యాగులు తయారవుతున్నాయి. పేపర్ బ్యాగులు పర్యావరణానికి హాని చెయ్యవు. వీటిని వాడటం చాలా ఈజీ. వీటిలో ప్యాకింగ్ తేలిగ్గానే ఉంటుంది. ఇవి చూసేందుకు చాలా అందంగా ఉంటాయి. ఇవి భూమిలో విష వ్యర్థాలను వదలవు. వీటిని వాడేశాక... న్యూస్ పేపర్లు, మేగజైన్లు, పుస్తకాలుగా రీసైక్లింగ్ చెయ్యవచ్చు. గతేడాది 2022 నాటికి యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలంటూ 2017లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఆచరణలో అది అమలు కావడం లేదు. మన దగ్గర మార్కెట్‌లోకి వస్తున్న ప్లాస్టిక్‌లో 80 శాతం తిరిగి సముద్రంలోకి చేరుతుంది. ప్లాస్టిక్ నియంత్రణ, డిస్పోజల్‌కు సరైన పద్దతులు అమలు చేయకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది.



## సిట్ విచారణకు విజయసాయి డుమ్మా

### మరోమారు హాజరవుతానంటూ సమాచారం

అమరావతి - నేటి ప్రభాతసూర్య :



మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం సిట్ విచారణకు హాజరుకాలేదు. అయితే తాను విచారణకు రాలేనని సిట్ అధికారులకు ముందే సమాచారం ఇచ్చారు. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటం వలన రాలేకపోతున్నట్లు- విజయసాయి సమాచారం పంపారు. తాను రేపో మాపో విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒకసారి సిట్ ముందు విజయసాయి విచారణకు హాజరయ్యారు. అయితే ఈరోజు సిట్ ముందుకు విజయసాయి రావాల్సి ఉండగా.. అంతుముందే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఎవరైతే కర్మను చేస్తారో వారు అనుభవించక తప్పదు అనే విధంగా భగవద్గీతకు సంబంధించి ఓ శ్లోకాన్ని ఆయన పోస్టు చేశారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్ 18న విజయసాయిని తొలిసారి సిట్ అధికారులు ప్రశ్నించారు. గత విచారణలో కీలక సూత్రధారులు, పాత్రధారుల పేర్లను మాజీ ఎంపీ వెల్లడించారు. ఈ క్రమంలో ఈ కేసులో మొత్తం 11 మందిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరంతా ప్రస్తుతం జైలులో ఉన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటనతో సంబరాలు





**కరీంనగర్(గన్నేరువరం) - నేటి ప్రభాత సూర్య:**
కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించడంతో మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు మార్గం మల్లేశం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు ప్రకటించి రాజకీయాలలో బీసీలకు తగిన స్థానం కల్పించడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, అల్వాల కోటి, ఓడ్నాల నరసయ్య, చింతల శ్రీధర్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, మాతంగి అనిల్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, దొగ్గల ప్రదీప్, కటకం తిరుపతి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## గాంధారి కిలపై మైసమ్మ తల్లికి ఘనంగా బోనాలు



**మంచిర్యాల జిల్లా, జులై 12 (నేటి ప్రభాతా సూర్య):**
గాంధారి కిలపై ఆషాఢ మాస బోనాలు ఈ ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరగనున్నాయి. మైసమ్మ తల్లికి నూట ఒక బోనాలతో మొక్కులు చెల్లించేందుకు నాయకపోడు కులస్తులు, ఆలయ పూజారుల ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున సమీకరించబోతున్నారు. ఈ పుణ్యకార్యానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ హాజరుకానున్నారు. కిలపై జరిగే ఈ పవిత్రోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకపోడు వర్గీయులు శనివారం విజ్ఞప్తి చేశారు. శబ్దాలు, శోభాయాత్రలు, సంప్రదాయ వేషధారణలతో గిరిజన సంస్కృతికి ప్రతిబింబంగా ఉండే ఈ బోనాల ఉత్సవం ప్రజల్ని ఆకట్టుకునే విధంగా ఉండనుంది.

## ట్రాక్టర్ యజమానుల సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు : గోదావరిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్

**చెన్నూర్,జులై 12 (నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి):**



గోదావరి నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ట్రాక్టర్ యజమానులు గత ఏడు రోజులుగా సమ్మె చేపడుతున్నారు. ఈ సమ్మెకు శనివారం బారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ శ్రేణులు చెన్నూరు పట్టణానికి చేరుకుని ట్రాక్టర్ యజమానులతో కలిసి నిరసనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "మినింగ్ శాఖ అధికారులు సాండ్ బజార్ ఏర్పాటు చేస్తామని చెప్పడం సమస్యను నివారించడంలో విఫలమవుతోంది. గోదావరి నదిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇసుక రీచ్ ఏర్పాటు చేయడమే దీర్ఘకాలిక పరిష్కారం," అని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, పట్టణ నిర్మాణ పనులు నిలిచిపోవడం, సాధారణ కుటుంబాలు ఇసుక కొనేలా కాకపోవడం వంటివి ప్రస్తుత పరిస్థితి తీవ్రతను చూపిస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఇసుక రీచ్ పునరుద్ధరణ కోసం ప్రభుత్వాన్ని తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో మద్దతు మరింత బలపడుతోంది..

## తెలంగాణ సీఎంను అభినందించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం




**మందమర్రి,నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి. జూలై 12:**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తీసుకున్న ప్రముఖ నిర్ణయానికి గాను ం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని స్వాగతిస్తూ ం మందమర్రి పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘ సభ్యులు కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంచుతూ ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు సకినాల శంకర్ మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీసీ సమాజానికి గర్వకారణం. ఇది పూర్తిగా బీసీల విజయాన్ని సూచిస్తుంది," అని పేర్కొన్నారు.

అలాగే, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో జరిగిన పోరాట ఫలితంగా ఈ రిజర్వేషన్ సాధ్యమైందని తెలిపారు. బీసీల హక్కుల కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్, కోశాధికారి గుడ్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బేర వేను గోపాలరావు, ఏదులాపురం రాజు, శేఖర్, వాయిస్ ప్రెసిడెంట్ దేవులపల్లి ప్రభాకర్, కార్యదర్శి నర్సోజి, పోలు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులపాలిట కొంగుబంగారం మైసమ్మ

### మందమర్రి బొక్కలగుట్టలో ఘనంగా ప్రారంభమైన కమాన్లు

**మందమర్రి నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి జులై 12:**
బొక్కలగుట్ట శ్రీ గాంధారి మైసమ్మ ఆలయం ప్రాంగణంలో శనివారం భక్తి శ్రద్ధలతో కమాన్లను ప్రారంభించారు. సింగరేణి సహకారంతో నిర్మించిన కమాన్లను వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ పూజాకార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం %గూ×ఖజ% బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ, మైసమ్మ తల్లి కోరిన వారికి కొంగుబంగారంగా నిలుస్తుందని, అమ్మవారిని ప్రతిష్ఠించిన నాటి నుండి ఇప్పటివరకు ఒక్క సారి కూడా ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసానికి చిహ్నంగా నిలుస్తున్న ఈ దేవస్థానం పట్ల ప్రజలలో అధిక భక్తి భావం నెలకొన్నదన్నారు.





ప్రతి సంవత్సరం జాతర సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివస్తారని, ఈసారి ఏర్పాటు చేసిన కమాన్లు ఆలయానికి మరింత ఆకర్షణను తీసుకొచ్చాయని ఆయన వివరించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### : మెడికల్ ఆఫీసర్ సత్యనారాయణ

**చెన్నూరు, జూలై 12 (నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి):**
పట్టణంలో కురుస్తున్న విస్తార వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్నాయని, ప్రజలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. శనివారం స్థానికంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో ముఖ్యంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రతి కుటుంబం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను తొలగించాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని, ఆరోగ్య సమస్యల నుంచి తక్షణ పరిరక్షణ పొందవచ్చని తెలిపారు. తలదునుకులు,



జ్వరాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని, స్వయంగా మందులు వాడరాదని హెచ్చరించారు. ప్రజలందరూ సహకరిస్తే సీజనల్ వ్యాధుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డాక్టర్ సత్యనారాయణ అభిప్రాయపడ్డారు.

## గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి": ఎస్ఐ ప్రవీణ్ కుమార్




**మంచిర్యాల , జూలై 12 (నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి):**
కాసిపేట మండలంలోని యువత మత్తు పదార్థాల బారిన పడకుండా, ఉత్తమ జీవన మార్గాన్ని ఎంచుకోవాలని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం సోమగూడెం ఎక్స్ రోడ్‌లో ఆటో డ్రైవర్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, "గంజాయి, ఆల్కహాల్, ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది. కుటుంబ, సామాజిక జీవితాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. అందువల్ల మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి," అని పేర్కొన్నారు. అతను మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విద్యా స్థాయిలో, వృత్తి జీవనంలో ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. స్థానిక ఆటోడ్రైవర్లు, యువత ఈ కార్యక్రమానికి సాత్వికంగా స్పందించారు. అనంతరం కోమటి చెను గ్రామానికి చెందిన యువకుడు దుర్గం అరుణ్ కుమార్ దర్శకత్వంలో రూపొందించిన "బాణామతి" షార్ట్ ఫిల్మ్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం మూఢనమ్మకాలపై అవగాహన పెంచే విధంగా రూపొందించబడింది. షార్ట్ ఫిల్మ్‌కి యువత, ప్రజలు మంచి స్పందన తెలిపారు.

## ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షణకు ముందస్తు చర్యలు

### కలెక్టర్ కుమార్ దీపక్


**మంచిర్యాల జిల్లా, జూలై 12 (ప్రభాతా సూర్య ప్రతినిధి):**
ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలను రక్షించేందుకు అన్ని అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం వెల్లడించారు. జిల్లాలో వర్షాలు విస్తృతంగా కురుస్తుండటంతో ప్రజల సురక్షిత నివాసం, అత్యవసర సేవలకు సులభంగా చేరుకోవటానికి అధికారులుఅప్రమత్తంగాఉన్నారనిపేర్కొ న్నారు. ఈ నేపథ్యంలో, నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పెరిగిన వర్షపాతం కారణంగా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్ 08736-250 501కు సంప్రదించవచ్చనిఆయన సూచించారు. ప్రజల భద్రతే



ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యతఅనికలెక్టర్ స్పష్టం చేశారు.

## ఆదర్శ వృద్ధాశ్రమంలో ఘనంగా నల్ల ప్రసాద్ జన్మదిన వేడుకలు





**చింతపల్లి -నేటి ప్రభాత సూర్య**
చింతపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి ఆదర్శ వృద్ధాశ్రమంలో శనివారం బహుజన్ సమాజ్ పార్టీ దేవరకొండ నియోజకవర్గం నాయకులు నల్ల ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఆదర్శ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు,గుడ్లు బ్రెడ్ అందించడం జరిగింది. అనంతరం వారి మధ్య లోనే కేక్ కటింగ్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకోవడం జరిగింది. వృద్ధులు నల్ల ప్రసాద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి మహేష్ ,నల్ల.సాయికిరణ్, సైదులు, గౌతమ్, అజయ్,సన్నీ , నాని,శివ పాల్గొన్నారు.

## కూన అజయ్ మృతి బాధాకరం

**- విద్యుత్ ఘాతంతో మృతి చెందిన అజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలి.**

**- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి**



**చింతపల్లి- నేటి ప్రభాత సూర్య**
చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామం సమైఖ్య నగర్ కాలనీకి చెందిన కూన అజయ్ మృతి బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు. గొల్లపల్లి గ్రామం సమైక్య నగర్ లో విద్యుత్ ఘాతంతో మృతి చెందిన అజయ్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఘాతంతో మృతి చెందిన అజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని ఆయన కోరారు. అజయ్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఉపసర్పంచ్ పరమేష్, పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పద్మశాలుల సంప్రదాయ ఆటలతో సందడి



**మందమరి, మంచిర్యాల - జూలై 12 (ప్రభాతా సూర్య ప్రతినిధి):**
మందమరి బస్టాండ్ పరిసర ప్రాంతం శనివారం నాడు ప్రత్యేకమైన సందడితో గగ్గొందింది. స్థానిక పద్మశాలి కులస్తులు ఐక్యంగా చేరి సంప్రదాయంగా భావించే "సాధన శూరుల ఆట" ను ప్రదర్శించారు. ఈ ఆటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు ప్రజలు తం డోపతండాలుగా బస్టాండ్ ప్రాంతానికి చేరుకుని ఉత్సాహంగా అల రించారు. పారంపర్య విలువలను ప్రతిబింబించే ఈ ఆటలో పౌరా ణిక పాత్రలు, ధైర్యసాహసాలు, చాకచక్యాన్ని ప్రతిబింబించే విన్యా సాలు స్థానిక ప్రజల హర్షధ్వానాలు పొందాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఆసక్తిగా పాల్గొని, ఆటల ప్రదర్శనలో మునిగిపోయారు. పద్మశాలి సంఘ సభ్యులు మాట్లాడుతూ, "ఈ తరహా ఆటలు మన సంస్కృతిని, పూర్వీకుల ప్రతిభను గుర్తు చేస్తాయి. యువతలో సాంస్కృతిక స్పృహను పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరం," అని తెలిపారు. ఇవేగాక, స్థానిక సంఘాలు మరియు పెద్దలు ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ప్రజల నుండి వచ్చిన స్పందన చూస్తుంటే ఇలాంటి సాంస్కృతిక ప్రదర్శనలకి భవిష్యత్తులో మరింత ప్రాధాన్యత కల్పించాలని వారు అభిప్రాయపడ్డారు.

## చదువుతోపాటు క్రీడలు, యుద్ధ విద్యలు ఎంతో అవసరం

**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**





**షాద్‌నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 12):**
షాద్ నగర్ పట్టణంలోని సాయిరాజా కన్వెన్షన్ హాల్‌లో శనివారం తెలంగాణ రాష్ట్ర పాఠశాలల క్రీడల కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ సౌత్ ఇండియా నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, యుద్ధ విద్యలు చాలా అవసరం. ఇవి శారీరకంగా, మానసికంగా వారిని అభివృద్ధి చేస్తాయి, అని పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న కరాటే విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పోటీలకు శిక్షణనిచ్చిన మాస్టర్ చెన్నయ్య సేవలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్ సింగ్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, మిద్దె గణేష్, రంగన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క నిఘానేత్రం వందమందితో సమానం

**మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్**

**సొంత నిధులతో 14 సిసి కెమెరాలు ఏర్పాటు**

**కెమెరాల దాతను అభినందించిన ఇన్స్పెక్టర్ నరసింహారావు**





**కొత్తూరు, ప్రభాత సూర్య (జులై 12)**
ఒక్కనిగా నేత్రం వంద మందితో సమానం ఎస్ బి పల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ అన్నారు. కొత్తూరు మండలంలోని ఎస్ బి పల్లి, కొడిచెర్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ చొరవతో గ్రామంలో శనివారం 14 సీసీ కెమెరాలను ఇన్స్పెక్టర్ నరసింహారావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో చాలా చోట్ల ఆలయాలపై దాడులు జరుగుతున్నాయని, అంతేకాకుండా చాలా దొంగతనాలు సైతం పెరిగాయని ఆయన అన్నారు. అందుకే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ..సీసీ కెమెరాల ఏర్పాటుతో పోలీసులకు నేర పరిశోధనలో ఎంతో సహాయం లభిస్తుందని ఇన్స్పెక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోపాలకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్ రెడ్డి,లింగారం సురేష్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి,శ్రీధర్,చందు, యాదయ్య,కృష్ణ,డాక్య, జైపాల్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి నలుగురు వ్యక్తులపై కేసు నమోదు



**చింతపల్లి -నేటి ప్రభాత సూర్య**

12 వతేది సాయంత్రం 5 గంటల సమయంలో చింతపల్లి మండలం పోలేపల్లి రాంనగర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు చింతపల్లి ఎస్సై తన సిబ్బందితో రైడ్ చేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిళ్ళు, నాలుగు సెల్ ఫోన్లు, 10500 రూపాయల నగదు స్వాధీనం చేసుకుని ఆవ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ముత్యాల రామ్మూర్తి తెలిపారు.

## ఆర్. కృష్ణయ్య చిత్రపటానికి పాలాభిషేకం




**42% బీసీ రిజర్వేషన్ల సాధనలో కీలక పాత్ర పోషించిన నేతకు గౌరవం**



**షాద్‌నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 12):**
బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీ ఆర్. కృష్ణయ్య నాయకత్వాన్ని గౌరవిస్తూ, శనివారం మధ్యాహ్నం షాద్‌నగర్ ఎండిఓ కార్యాలయం సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.
ఈ కార్యక్రమం జాతీయ బీసీ సేన అధ్యక్షులు శ్రీ బర్క కృష్ణన్న ఆదేశాల మేరకు, అసెంబ్లీ బీసీ సేన అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరగడం విశేషం.
ఈ సందర్భంగా బీసీ సేన నేతలు మాట్లాడుతూ ..గత కొన్ని రోజులుగా బర్క కృష్ణ మార్గదర్శకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఉద్యమం 42% బీసీ రిజర్వేషన్ల సాధనకు బలమైన పునాది వేసింది. ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపిన ఆర్. కృష్ణయ్య సేవలు చిరస్మరణీయమని భావిస్తూ పాలాభిషేకం జరిపాం, అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు
జిల్లా ఉపాధ్యక్షులు మేకల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప, మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి, యువజన అధ్యక్షులు అలాది శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు తంగిడిపల్లి శంకర్, టౌన్ కార్యదర్శి మల్కాపురం రవి, అసెంబ్లీ కార్యదర్శులు జూపల్లి చంద్రశేఖర్, భూషణ్ నరేష్ ప్రచార కార్యదర్శి మమత, కోశాధికారి జమాల్పూర్ చందూలాల్, ఉపాధ్యక్షులు వసంత, బాలమణి, వార్డు అధ్యక్షురాలు సింధూర, ఫరూక్ నగర్ మండల నేతలు జక్కల జలజ, స్రవంతి, గ్రామ, మండల నాయకులు: అనిత, చెన్నయ్య (ఫరూక్‌నగర్), మహేందర్, రవి (ఫరూక్‌నగర్ అధ్యక్షులు), పుర్ర రాజు (చౌదర్‌గూడా), అమృతం దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ 42% చారిత్రాత్మక నిర్ణయం





**-మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు**

**-బీసీలది కళ నెరవేరింది**

**-కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవికి తీవ్రమైన పోటీ**

**-యాచారం లో ఘనంగా బీసీ నాయకుల సంబరాలు**

**-రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, మహేష్ గౌడ్ కు పాలాభిషేకం**

**యాచారం నేటి ప్రభాత సూర్య (జులై 12):**
తెలంగాణ రాష్ట్రంలో ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ క్యాబినెట్ ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయం అని మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్కు నరసింహ అధ్యక్షతనతో బీసీ సెల్ మండల అధ్యక్షుడు వరి కుప్పల తిరుమలేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల కేంద్రము లో అంబేద్కర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వం బిసి రిజర్వేషన్ 27% శాతానికి తగ్గించిందని ఆయన విమర్శ చేశారు. బీసీలకు రిజర్వేషన్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని ఆయన చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల లో బీసీలకు 42 శాతం కేటాయించడం జరుగుతుందన్నారు. యాచారం మండలంలో కాంగ్రెస్ పార్టీ అన్ని పార్టీలకంటే బలంగా ఉందని అన్నారు. మండల అధ్యక్షుడు పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది. పోటీలో 44 మంది అధిష్టానానికి దరఖాస్తులు చేసుకున్నా రు. స్థానిక ఎన్నికల్లో ప్రతి ఊరిలో సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి అత్యధిక మెజార్టీతో కైవాసం చేసుకోవాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఒక్కడు కష్టపడి పార్టీకి పనిచేయాలని నాయకులు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గత ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేదోడికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గులాం అక్బర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల్ భాస్కర్, సేవాదళ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి భాస్కర్ గౌడ్ ,కాంగ్రెస్ మండలం ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, డిసిసి అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్, అరవింద్ నాయక్, మోటే శ్రీశైలం, లిక్కి రంగారెడ్డి, చీర శేఖర్, పాశం జయప్రకాష్, బిక్షపతి గౌడ్, మస్కు అనిల్ కుమార్, మస్కు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాన్ని మరింత అభివృద్ధి పరచాలి



**ఇబ్రహీంపట్నం- నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (వెంకటేష్ )**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ లో గల శ్రీ స్వయంభు లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో ప్రతి శనివారం నిర్వహించే అన్నదానంలో భాగంగా ఈ శని వారం బిజెపి జిల్లా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ పొట్టి రాములు, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, ప్రముఖ న్యాయవాదులు పొట్టి శ్రీనివాస్ సోదరుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి రాములు మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి చాలా మహిమాన్వితమైన దేవుడని ప్రతి శనివారం ఒక జాతరల అశేష సంఖ్యలో ప్రజలు భక్తులు స్వామివారి దర్శనాలు చేసుకోవడం నిజంగా సంతోషించదగ్గ విషయమని అన్నారు. భక్తులు ప్రజలందరూ కలిసి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని, అదేవిధంగా భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు.

## నేడు ఎలిమినేడులో మహంకాళి అమ్మవారి బోనాలు

**ఇబ్రహీంపట్నం- నేటిప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (వెంకటేష్) :**
ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో ఆదివారం రోజున మహంకాళి అమ్మవారి బోనాలు నిర్వహిస్తున్నట్లు కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు కోట్టాముల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద కురుమ ఇక్క చంద్రయ్య. సెల్ వో జి. నిట్టు బాలయ్య, పెద్దలు పట్నం బీరప్ప, బీ సి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బజార్ బిక్షపతి, గ్రామ పెద్దలు పాల్గొననున్నట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారు ఆశీస్సులు పొందాలని ఆయన తెలిపారు.

## ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలకు ప్రారంభ సంకేతం



**మంచిర్యాల జిల్లా, జూలై 12 (ప్రభాత సూర్య ప్రతినిధి):**
కాసిపేట మండలం దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం (రెకగ్నిషన్ యూనియన్) ఎన్నికల నిర్వహణకు అధికారికంగా గ్రీన్ సిగ్నల్ లభించింది. శుక్రవారం కంపెనీ ప్రాంగణంలో డీఎల్సీ (లేబర్ డిప్యూటీ కమిషనర్) రాజేశ్వరి ఆధ్వర్యంలో అర్హత కలిగిన ఐదు యూనియన్ల ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్లకు గుర్తులను కేటాయించి, ఎన్నికల నియమావళిని అందజేశారు. ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వస్తుందని, అన్ని యూనియన్లు దాన్ని గౌరవించి పనిచేయాలని డీఎల్సీ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విషయమై ఈ నెల 18న గేట్ మీటింగులు, తుది ఎన్నికల తేదీలను నిర్ణయించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

## దుర్గాదేవి జాతర.. భారీగా తరలి రానున్న భక్తులు



**మంచిర్యాల జిల్లా, జూలై 12 (నేటి ప్రభాతా సూర్య ప్రతినిధి):** హాజీపూర్ మండలంలోని ర్యాలీగఢ్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం నాడు దుర్గాదేవి జాతరను ఘనంగా నిర్వహిం చనున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల రాకతో రద్దీ నెలకొననున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలియ జేశారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో క్వారీలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో వార్షికోత్సవాన్ని నిర్వహించడం ఆనవా యితీగా కొనసాగుతోంది. భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మ వారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకారాలు, హారతులు నిర్వహించనున్నారు. అమ్మవారి సేవలో నిమగ్నమయ్యే భక్తులకు తల్లిదేవి ఆశీస్సులు లభిస్తాయని ఆలయ కమిటీ పేర్కొంది. భద్రత, నీటి సరఫరా, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను గ్రామపంచాయతీ, స్థానిక పోలీసులు సమన్వయంతో చేపట్టినట్లు సమాచారం.

## కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో గ్రామస్థాయి ఎన్నికలు

**షాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పానుగంటి సురేందర్**

**షాబాద్: నేటి ప్రభాత సూర్య**



షాబాద్ మండలం పరిధిలో ఉన్న గ్రామాలో యువకులకు రాజకీయంగా చక్కటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పానుగంటి సురేందర్ తెలిపారు. గ్రామస్థాయి మరియు బూతు స్థాయిలో యూత్ కాంగ్రెస్ పదవుల భర్తకి సన్నాహాలు జరుగుతు న్నాయని ఆయన వెల్లడించారు కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి నిజమైన సేవాభావం కల యువతకి ఈ దశ ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు .గ్రామ యువత తమ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను సంప్రదించి పూర్తి సమాచారం తెలుసుకోవాలని పిలుపునిచ్చారు పదవుల ఎంపిక ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు లేకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతకే బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువత కీలకంగా మారాలని భవిష్యత్తు నాయకత్వానికి పునాది ఇక్కడే పడుతుందని ఆయన సూచించారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఆర్డినెన్స్ ఒక కుట్ర'



**మంచిర్యాల, జూలై 12 (ప్రభాతా సూర్య ప్రతినిధి):**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా తీసుకుంటున్న చర్యలు పాక్షికతపూరణమైనవని, ఇది ఓ రాజకీయ కుట్ర అని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం మంచిర్యాల పట్టణంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, “2018లో తెరాస ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ 2/2018 ప్రకారం బీసీలకు కేవలం 22 శాతం రిజర్వేషన్లు మాత్రమే కల్పించాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధంగా తక్కువ రిజర్వేషన్‌తో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది” అని మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేయాలంటే జనాభా మేరకే రిజర్వేషన్లు కల్పించాలని, వాస్తవాలను ప్రక్కన పెట్టి తీసుకునే ఒకపక్ష నిర్ణయాలను తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రిజర్వేషన్ల విషయంలో బీసీలను మభ్యపెట్టే చర్యలను తిప్పికొట్టేందుకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఇతర సంఘాల ప్రతినిధులు, బీసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# నిరుపేద కుటుంబానికి రాయల్ వినాయక గ్రూప్ యూత్ ఆర్థిక సహాయం



**మంచిర్యాల, జులై 12 (ప్రభాతా సూర్య ప్రతినిధి):**
దండేపల్లి మండలం ద్వారాక గ్రామానికి చెందిన కాటుకూరి లక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న రాయల్ వినాయక గ్రూప్ యూత్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం లక్ష్మి కుమారుడు కాటుకూరి శంకర్‌కు రూ. 10,516 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంలో గ్రూప్ సభ్యులు సాయినీ, ప్రవీణ్, సూరినేని శంకర్, జె. విజయ్, ఆర్. గణేష్, మాజీ ఉపసర్పంచ్ ప్రతాప్, రజక సంఘ అధ్యక్షుడు మందపెల్లి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ చర్య స్థానికంగా ప్రశంసలు పొందుతోంది. సామాజిక బాధ్యతను నెరవేర్చిన యువకులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ ఏఈ



**మంచిర్యాల,నేటి ప్రబాత సూర్య. ప్రతినిధి జులై 12:**
దండేపల్లి మండలంలోని తాళ్లపేట్ గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇండ్ల నిర్మాణాలను హౌసింగ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఇలియాస్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో తొలి లబ్దిదారురాలు దుర్గం రజిత రవీందర్ నిర్మిస్తున్న ఇల్లు బేస్‌మెంట్ స్థాయిలో పూర్తి కావడంతో, ఆయన తలసరి మానాకాల ప్రకారం ఇంటి కొలతలు పరిశీలించి, నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. అనంతరం మొదటి విడత బేస్‌మెంట్ స్థాయి బిల్‌కు లక్ష రూపాయల మంజూరుకి రికార్డులలో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతన్న, కారోబార్ శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు కంది సతీష్ కుమార్, మల్టాజీ గ్రామ సర్పంచ్ అడాయి కాంతారావు తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ పథకం కింద పేద కుటుంబాలకు గృహనిర్మాణం అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సమీక్షతో పనుల్లో మరింత పారదర్శకత, వేగం తీసుకురావాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.

# నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును పరిశీలించిన కార్పొరేటర్

**నేటి ప్రభాత సూర్య:**
124 ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని దత్తత్రయ కాలనీ సాయిబాబా టెంపుల్ వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి వేయాలని, మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, బ్రహ్మానంద గౌడ్, పి.ఎల్ ప్రసాద్, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇందారం గ్రామంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

**మంచిర్యాల జిల్లా, జూలై 12 (ప్రభాత సూర్య ప్రతినిధి):**
జైపూర్ మండలంలోని ఇందారం గ్రామంలో శనివారం ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రజలతో నేరుగా ముఖాముఖి సమావేశమైన పోలీసులు, స్థానిక సమస్యలను తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 70 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోల ధ్రువపత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేక పోయిన వాహనాలను పోలీసులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, బీమా వంటి తప్పనిసరి డాక్యుమెంట్లను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని అధికారులు హితవు పలికారు. అనంతరం, ఏసీపీ వెంకటేశ్వర్లు గ్రామ ప్రజలకు సైబర్ నేరాల ముప్పు, మాదకద్రవ్యాల దుష్పరిణా మాలపై అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమానికి గ్రామ పెద్దలు, స్థానిక యువత, మహిళలు భారీగా హాజరయ్యారు. ప్రజలతో నేరుగా మాట్లాడిన



ఏసీపీ, వారి అభిప్రాయాలు వినిపించారు.
ఈ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం పోలీసుల ప్రజానికాల మధ్య బంధాన్ని బలోపేతం చేసే దిశగా ఎంతగానో ఉపయుక్తమవుతోందని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# సీఈఆర్ క్లబ్‌లో వైద్య శిబిరం



## ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రాపాక రమేష్

**మందమర్రి, జులై 12 (నేటి ప్రభాత సూర్య ప్రతినిధి):**
మందమర్రి మండలంలోని సీఈఆర్ క్లబ్ వద్ద శనివారం వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాపాక రమేష్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షయ వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరం అని పేర్కొన్నారు. “రెండు వారాలకు పైగా దగ్గు ఉంటే, అది క్షయ వ్యాధి లక్షణం కావచ్చు. ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా టెస్టులు, చికిత్స అందుబాటులో ఉన్నాయి. ఈ వ్యాధి నిర్ధారణ అయిన వారికి నెలకి రూ. 1000 చొప్పున పోషక భత్యం కూడా ప్రభుత్వం అందిస్తోంది” అని వివరించారు. క్షయ వ్యాధి ప్రధానంగా తుంపర్ల ద్వారా వ్యాపించే వ్యాధిగా, మద్యం సేవించే వారు, పొగాకు నమిలేవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. వైద్య శిబిరంలో బిపి, షుగర్, హెచ్ఐవీ, హెపటైటిస్ %దీ, జ%, టి.బి. తదితర పరీక్షలు నిర్వహించారు. ఎక్స్‌రే అవసరమున్న రోగులను బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి 102 అంబులెన్స్ ద్వారా తరలించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది:
ఎంఎల్‌హెచ్‌పీలు: డా. విష్ణుతేజ, ప్రీతి, స్వర్ణలత, జిల్లా ఎన్‌వీహెచ్‌సిపి ఇంచార్జ్ మధుబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత ఆర్బీఎస్కే సిబ్బంది, సి.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, సూపర్వైజర్ కళావతి, టిబి సూపర్వైజర్ కుమార్, ఏఎన్ఎంలు: మంజుశ్రీ, పద్మావతి, జ్యోతి, హెచ్‌ఈలు: మధుసూదన్, శ్రీధర్, కుమారస్వామి, ల్యాబ్ టెక్నీషియన్: గట్టయ్య, ఎన్‌జీఓ జీఎన్ఎం: కీరవాణి, ఓఆర్‌డబ్ల్యూ: లక్ష్మి, ఓఎస్: నితిన్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి






**తుర్కయంజాల్-నేటి ప్రభాత సూర్య:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను, మండలాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సుమారు 8 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాం రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల రాష్ట్రం కుంటుటుపడిపో యిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని, కాంగ్రెస్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు.
ఈ కార్యక్రమంలోమున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, టి. పి. సి. సి సభ్యులు కాకుమను సునీల్, మాజీ కౌన్సిలర్లు మర్రి మాధవి మహేందర్ రెడ్డి, మేతరి అనురాధ దర్శన్, రేవల్లి యాదమ్మ యాదగిరి, పుల్ల గుర్రం కీర్తన విజయేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బద్దం వెంకట్ రెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి (జానీ ) దర్శన్, సినర్జీ హోమ్స్ కాలనీ అధ్యక్షులు పల్ల శ్రీనివాస్ రెడ్డి, బొక్క వంశీధర్ రెడ్డి, డి. ఈ, బిక్షపతి, ఏ. ఈ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య జూనియర్ కాలేజీపై చర్యలు తీసుకోవాలి

**తాండూరు / జూలై 12: నేటి ప్రభాత సూర్య:**
తాండూరు పట్టణంలో ప్రైవేట్ కాలేజీలో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూప్రభుత్వం పర్మిషన్ లేకుండా కొనసాగిస్తున్న జూనియర్ కాలేజ్ ల పై చట్టపరమైన చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరు పట్టణంలో అనుమతి లేకుండా పర్మిషన్ లేకుండా అనేకమంది విద్యార్థుల జీవి తాలతో చెలగాటమాడుతున్న టి హెచ్ కాలేజ్ పై ప్రభుత్వం జిల్లా కలెక్టర్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే అలాంటి కాలేజీలపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థులని మోసం చేస్తున్న జూనియర్ కాలేజీ యజ మాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా తాండూరు చైతన్య జూనియర్ కాలేజీలో విద్యార్థుల నుండి ఎక్సమ్ ఫీజులు తీసుకొని ఎగ్జామ్ రాయించకుండా మోసం చేసిన అనేక మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న తాండూరు చైతన్య జూనియర్ కాలేజీల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అవినీతి అక్రమాలు మోసం చేసిన చైతన్య జూనియర్ కాలేజ్ పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తాండూరు పట్టణానికి చెందిన జిల్లా నోడల్ ఆఫీసర్ పైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లని బలోపేతం చేయకుండా సిబ్బందిని నియమించకుండా గెస్ట్ ఫ్యాకల్టీని నియమించకుండా నిర్వీర్యం చేస్తూ



ప్రైవేట్ కాలేజీలకు సహకరిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అనుమతి లేని జూనియర్ కాలేజీలకు సహకరిస్తూ మోసానికి పాల్పడు తున్న తాండూర్ చైతన్య జూనియర్ కాలేజీ పై చర్య తీసు కొని పర్మిషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం చంద్రయ్య సిపిఎం జిల్లా నాయకులు బుస చంద్రయ్య బస్వా రాజు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్‌ను పరామర్శించిన ప్రభుత్వ చీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి



**తాండూరు / జూలై 12 :నేటి ప్రభాత సూర్య:**
తాండూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ను ప్రభుత్వ చీఫ్ వీఫ్ మహేందర్ రెడ్డి పరామర్శించారు. తాండూర్ పట్టణం లోని వార్డు నెంబర్ 4 ఇందిరానగర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మొహమ్మద్ అస్లాం గారి తండ్రి గత కొన్నిరోజులుగా అనారోగ్యం తో మృతి చెందాగా శనివారం వారి నివాసానికి వెళ్లి కుమారులు అక్రమ్, జావీద్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహేందర్రెడ్డి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయ కర్త కరణం పురుషోత్తం రావు , మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డలి పరిమళ రవీందర్, బోయ రాజు, సలీం, బీదర్ రాజశేఖర్, అబ్దుల్ ఖవి, యువ నాయకులు బిర్కెట్ రఘు, భగవాన్, బిసి సెల్ నాయకులు పునీత్ కుమార్, అయ్యూబ్ ఖాన్, శివానంద్ మడపతి, ఆనంద్ గౌడ్ ఉన్నారు.

# రక్తం ఇస్తామంటూ మోసం చేస్తున్న ముఠాలు



**నేటి ప్రభాత సూర్య:**
ఇటీవల కాలంలో పెరిగిపోతున్న ఘటనలు. డబ్బులు ఇచ్చి అల్లాడిపోతున్న బాధితులు. ఓ వైపు ప్రాణం పోతున్న వారు రక్తం కోసం ఎదురు చూస్తుంటే.. ఇదే అవకాశంగా తీసుకుని వారి దగ్గర నుంచి డబ్బులు దండుకుంటున్నారు కొందరు దుర్మార్గులు. మానవత్వానికి మాయనిమచ్చగా మిగులుతూ.. నిలువెల్లా దోపిడీ చేస్తున్నారు. ఫలానా వ్యక్తి ఆసుపత్రిలో చావు బతుకుల్లో ఉన్నాడు.. ఈ గ్రూప్ రక్తం కావాలని రోగి సంబంధీకులు వాట్సాప్ గ్రూపుల్లో రిక్వెస్ట్ లు పెడుతుండటం మనం చూస్తూనే ఉంటాం. ఇదే అవకాశంగా, కొందరు ముఠా తాము రక్తదానం ఇస్తామంటూ వారికి ఫోన్ చేసి ఆశపెడుతున్నారు. అయితే, తాము ఊరి నుంచి రావడానికి కారు ఛార్జీలు ఇవ్వాలని కోరుతుండటంతో.. రోగి తరఫు వారు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిస్తున్నారు. అనంతరం, ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుంటున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ట్రూ హెల్పింగ్ హాండ్స్ జాయింట్ సెక్రెటరీ బైకాని శ్రీశైలం యాదవ్, రోహిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆపదలో ఉన్నవారిని ఇలా మోసం చేసేవారిపై పీడీ చట్టాలు ప్రయోగించి అత్యంత కఠినంగా శిక్షించాలని కోరారు.

# ఆదర్శ దంపతులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం

**- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**



**తాండూరు / జూలై 12 : నేటి ప్రభాత సూర్య:**
ఆదర్శ దంపతులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన హరిజన్ తుల్జరాం, చెంగోల్ గాయత్రి గత రెండు సంవత్సరాల క్రితం కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు %ష్ట్రవ%. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహాయం రూ. 2,50,000/- చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఆదర్శ దంపతులకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తోపాటు నారాయణ పేట్ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి కలిసి చెక్కు అందజేశారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

# క్రీడారంగం

## టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఇటలీ మొదటిసారిగా అర్హత



టీ20 క్రికెట్ పరిచయం తర్వాత ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రజాదరణ పొందుతోంది. 3 గంటల్లోనే మ్యాచ్ ఉత్సాహంగా ముగుస్తుంది. కాబట్టి అనేక యూరోపియన్ దేశాలు క్రికెట్ ఆడేందుకు ఆసక్తి చూపుతున్నాయి. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఇటలీ మొదటి సారిగా అర్హత సాధించింది. దీని ద్వారా ఇప్పటివరకు క్రికెట్ వైపు చూడని యూరోపియన్ దేశాలలో ఇటలీ అర్హత సాధించడం ఒక ప్రత్యేకత. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ కోసం యూరోపియన్ ప్రాంతీయ క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఇటలీ, నెదర్లాండ్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇటలీ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని నెదర్లాండ్స్ జట్టు 16.2 ఓవర్లలో ఛేదించింది. దీని ద్వారా నెదర్లాండ్స్ జట్టు టీ20 ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. నెదర్లాండ్స్ జట్టుపై ఇటలీ ఓడినప్పటికీ.. గ్రూప్‌లో 4 మ్యాచ్ లు ఆడిన ఇటలీ 2 విజయాలు, ఒక పరాజయం, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 5 పాయింట్లు ఖాతాలో వేసుకుని పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా ముందంజ వేసింది.పాయింట్ల పట్టికలో స్కాట్లాండ్ జట్టుతో పోలిస్తే అధిక రన్ రేట్ సాధించిన ఇటలీ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించింది. ఇదిలా ఉండగా.. గత 4 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్లలో స్థానం సంపాదించిన స్కాట్లాండ్ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించకుండానే నిష్క్రమించింది. మొత్తం 20 జట్లు 2026 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఆడనున్నాయి. ప్రస్తుతం వరకు 15 జట్లు అర్హత సాధించాయి. ఇంకా ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ టోర్నమెంట్ నుంచి 3 జట్లు, ఆఫ్రికా క్వాలిఫయర్ ద్వారా రెండు జట్లు ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నాయి.ఈ నేపథ్యంలో మాజీ ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెట్ ఆటగాడు జో బర్న్స్ ప్రస్తుతం ఇటలీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ సమయంలో పాకిస్థాన్ అమెరికా జట్టుతో ఓడిపోయిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఇటలీ జట్టు ప్రపంచకప్ టీ20లో ఆడనున్నందున పాకిస్తాన్ జట్టు జాగ్రత్తగా ఉండాలని భారత అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.

## సెంచరీతో చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్




ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ దుమ్మురేపుతున్నాడు. ఐదు టెస్టల అండర్సన్-సచిన్ ట్రోఫీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన రాహుల్.. 176 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో కీలక భాగస్వామ్యాలతో రాహుల్ జట్టును ఆదుకున్నాడు. అయితే సెంచరీ పూర్తయిన వెంటనే షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కరుణ్ నాయర్‌తో కలిసి రెండో వికెట్‌కు 61 పరుగులు జోడించిన రాహుల్.. రిషభ్ పంత్‌తో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.క్రికెట్ పుట్టిల్లు లార్డ్స్‌లో రాహుల్‌కు ఇది రెండో సెంచరీ. దాంతో ఓ అరుదైన రికార్డ్‌ను కేఎల్ రాహుల్ తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్‌ల్లో లార్డ్స్ వేదికగా రెండు శతకాలు నమోదు చేసిన తొలి ఆసియా ఓపెనర్‌గా నిలిచాడు. ఈ ఘనత అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు.రాహుల్ కంటే ముందు టీమిండియా దిగ్గజ క్రికెటర్ వెంగ్‌సర్కార్ లార్డ్స్ వేదికగా మూడు సెంచరీలు బాదాడు. లార్డ్స్ వేదికగా కేఎల్ రాహుల్ తన తొలి శతకాన్ని 2021లో నమోదు చేశాడు. ఆ మ్యాచ్‌లో టీమిండియా 151 పరుగుల తేడాతో విజయం సాధించింది. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు లార్డ్స్ వేదికగా సెంచరీ అందుకోలేకపోయారు. లార్డ్స్ మైదానంలో భారత్ నుంచి 10 మంది బ్యాటర్లు మాత్రమే సెంచరీలు నమోదు చేసి హానర్ బోర్డులో తమ పేరును లిఖించుకున్నారు.ఓవరాల్‌గా కేఎల్ రాహుల్‌కు ఇది 10వ టెస్ట్ సెంచరీ కాగా.. ఇంగ్లండ్ గడ్డపై నాలుగో టెస్ట్ శతకం. దాంతో ఇంగ్లండ్ గడ్డపై మూడు సెంచరీలు సాధించిన తొలి భారత ఓపెనర్‌గా రాహుల్ నిలిచాడు.

## బంతి మార్పుపై వివాదం..

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ చాలా చర్చనీయాంశంగా మారింది. రెండో రోజు బంతి మార్పుపై పెద్ద వివా దం చెలరేగింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్ల తర్వాత రూల్స్ ప్రకారం భారత్ కొత్త బంతిని అందుకుంది. అయితే 10 ఓవర్లు పూర్తయ్యేసరికే బంతి ఆకా రం దెబ్బతిన్నది. భారత ఆట గాళ్ల ఫిర్యాదులో బంతిని పరిశీలించిన అంపైర్ మరో బాల్‌ను తెప్పించాడు. 10 ఓవర్లు మాత్రమే ఆడిన బాల్ తీసు కొచ్చాడు. అయితే ఈ బంతి పాతదానికి కంటే మరి ఘోరంగా ఉండటంతో భారత ఆట గాళ్లు తీవ్ర ఆగ్ర హానికి గుర య్యారు. ఇదే విషయాన్ని అంపైర్‌కు చెప్పే ప్రయత్నం చేయగా.. అతను వినిపించు కోలేదు. దాంతో మరింత అస హనానికి గురైన గిల్.. అంపైర్‌తో గొడవ పడ్డాడు. ఇప్పుడు జో రూట్ దీనిపై స్పందించాడు.ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జో రూట్ బంతి మార్పుపై మాట్లా డాడు. టీమిండియా తీరుపై రూట్ ప్రశ్నలు లేవనెత్తాడు. డ్యూక్స్ బంతి మార్పుపై ఇంత చర్చ అవసరం లేదని జో రూట్ అభిప్రాయ పడ్డాడు. జో రూట్ మాట్లాడుతూ.. "ఒక వేళ బంతి ఆకారం దెబ్బతింటే దానిని మార్చుకోవాలి. కానీ దీనిపై ఎటువంటి రాద్ధాంతం చేయకూడదు. ఇక్కడ ప్రపంచం అంతమైపోయిందని నేను అనుకోవడం లేదు. ఇది ఆటలో ఒక కొత్త మలుపు తీసుకువస్తుందని నేను భావిస్తున్నాను. మార్పులకు అనుగుణంగా మారే సామర్థ్యం మీకు ఉండాలి. దాని వల్ల స్వింగ్ ఆగిపోయినా లేదా మరింత పెరిగినా సరే రాణించే కెపాసిటీ ఉండాలి." అంటూ జో రూట్ అభిప్రాయపడ్డాడు.

## కపిల్ దేవ్‌ను దాటేసిన బుమ్రా

లార్డ్స్ టెస్ట్‌లో జస్ప్రీత్ బుమ్రా భారత ఫాస్ట్ బౌలర్లకు ఇప్పటివరకు కలలో కూడా సాధ్యం కాని దాన్ని నిజం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్న బుమ్రా, మూడో టెస్ట్ రెండో రోజు ఉదయం బంతి పట్టుకోగానే ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లపై సునామీలా విరుచుకుపడ్డాడు. అతను ఈ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీయడమే కాకుండా దిగ్గజ బౌలర్ కపిల్ దేవ్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు.లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి, జస్ప్రీత్ బుమ్రా తన కెరీర్‌లో 15వ ఐదు వికెట్ల ఘనతను పూర్తి చేసుకున్నాడు. దీనిలో స్పెషాలిటీ ఏంటంటే.. ఇది విదేశీ గడ్డపై బుమ్రా 13సార్లు ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు.




దీంతో అతను కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టాడు. కపిల్ దేవ్ పేరు మీద 12 సార్లు ఐదు వికెట్లను తీసిన ఘనత సాధించిన రికార్డు ఉంది. ఇప్పుడు బుమ్రా విదేశీ గడ్డపై అత్యధిక సార్లు ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.విదేశీ గడ్డపై అత్యధిక ఐదు వికెట్ల ఘనతలు సాధించిన వారిలో జస్ప్రీత్ బుమ్రా టాప్ ప్లేసులో ఉన్నాడు. బుమ్రా తర్వాతి స్థానంలో భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ఉన్నాడు. అతను విదేశీ గడ్డపై 12 సార్లు ఐదు వికెట్లు తీశాడు. మూడో స్థానంలో భారత అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరైన అనిల్ కుంబ్లే నిలిచాడు.. తను 10 సార్లు ఈ ఫీట్‌ను నమోదు చేసుకున్నాడు. ఇక నాలుగో స్థానంలో టీమిండియా సీనియర్ పేసర్ ఇషాంత్ శర్మ ఉన్నాడు. అతను 9 సార్లు ఈ ఘనతను సాధించాడు.



## యానిమల్ లాంటి హీరోతో డేటింగ్

### నటి రష్మిక మందన్న హాట్ కామెంట్స్

వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక కెరీర్‌కు, 'యానిమల్' మూవీ ఎంతో విజయాన్ని అందించింది. అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మికను.. ఓ ఇంటర్వ్యూలో నిజ జీవితంలో యానిమల్ హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని ప్రశ్న ఎదురవ్వగా .. ఆసక్తికర సమాధానమిచ్చింది రష్మిక. అలాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు.ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు- 'ది గర్ల్ ఫ్రెండ్'తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు అలాగే అట్లీ-అల్లు అర్జున్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు- వార్తలు వస్తున్నాయి.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

# సినిమా

## లెనిన్ మూవీ నుంచి శ్రీలీల ఔట్

అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్-టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్ షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పుడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ చిత్రీకరించ బోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు-.. సమాచారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.



Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.